# "దేవుల్లంటె....మతమంటె మాటలనుకుంటడ్రా..!"

నాకు బాగ మతికుంది. బడికి పొయ్యేటప్పుడు మేం బడిపిల్లగాండ్లం మా దేవుడు పెద్దోడంటె మా దేవుడు పెద్దోడని వాదించుకునెటోల్లం. గమ్మతికే అట్ల మాట్లాడకొని వెంటనే మర్చిపోయెటోల్లం. ఓపారి కచ్చీరుకాడ సానమంది కూసున్నరు. గండ్ల తీరుతీరు కులపోల్లున్నరు. దేవుల్ల గురించి మాట్లాడుడు మొదలైంది. గమ్మతనిపిత్తంటె నేం బోయ్యాడ నిల్సున్న. "విష్ణుమూర్తి అందరికంటె పెద్ద దేవుడు. దేవతలకు కట్టాలచ్చినప్పుడల్ల వాళ్ళ నాదుకంటడు. అవతారాలెత్తి రాచ్చసులంజంపుతడు. గయినెను మించిన దేవుడే లేడు" ఓ నిలువు నామాల అయ్యగారన్నడు.

"విష్ణుమూర్తి చేసేటియన్ని లంగపనులే. దేవుడంటె శెంకరుడే" అన్నడో అడ్డనామాల బాపనయినె.

"తెలివిలేక వరాలిచ్చి కష్టాల్దెచ్చిపెడితె ఆదుకున్నడెన్నో సార్ల విష్ణుమూర్తి"

"విష్ణువు దగ్గెర కపటముంది. భోళా శంకరుడే నిజమైన దేవుడు"

"వీరబ్రహ్మంగారిని మించిన దేవుడే లేడు. కాలజ్ఞానాన్ని ఎంత మంచిగ సెప్పిండు. అయినె చెప్పినయన్ని తప్పకుంటయితన్నయి" అని అన్నడో కంసాలయినె.

"అన్ని దేవుల్లకు మూలమాదిశెక్తి. ఆ ఆదిశక్తి రూపమే కన్యకాపరమేశ్వరి. గామే నిజమైన దేవత" అన్నడో కొమటయినె.

"ఈల్లెవ్వలు పెద్ద దేవుల్లు గారు. శ్రీకృష్ణుడెన్ని లీలలు జూపెట్టిండు. గయినె తెలివికల దేవుడు. మా కులదైవం" అన్నాడో గొల్లయినె.

"లేదు....లేదు...మా ఎల్లవ్వ తల్లికి మంచి శెక్తులున్నయి" అన్నడో గొండ్లయినె.

"ఏం సెప్పిండు తియ్యి. మీ మతంల మనుషుల కంటెక్కో దేవుతలున్నరు. అల్లా అంటె ఒక్కడే ఉంటడు. మహమ్మద్ ప్రవక్తను మించినోడు లేడు" అన్నడు దూదేకుల సాయెబు.

"మొన్నట్దాక మీ వోల్లంత తెలుగోల్లేనయిరి. మీ అయ్య తురుకమతం తీసుకోంగనే గాదేవుడే పెద్దోడయిండా?"

"ఈల్లందరికంటె ఏసుక్రీస్తే గొప్పోడు. అయినెన్ని మయిమల్జూపెట్టిండు. లేనోల్లకోసురమెంత జేసిండు. అకరుకు శిలువశిక్షననుభవించిండు" అన్నడు కొన్నేండ్లకిందనే ఏసుమతం తీసుకున్న హరిజెనుడు.

గిట్ల ఎన్నోసార్లు వాదించుకునుడు నేం జూసిన. కనెవ్వలు గూడ గదాన్ని యాదికుంచుకోకపోదురు. గమ్మత్తుకన్నట్టు మాట్లాడుకోని మర్సిపోయెటోల్లు. ఎవ్వలేదేవున్ని మొక్కినా అందరు కల్సి మెల్సుండెటోల్లు. ఎవ్వలదేమతమో. ఏం దేవుడో అనే భేదాలున్నట్టు కనబడకపోవు.

దసుర పండుగకు దూదేకులోల్లు, ఏసుమతం తీసుకున్నోల్లయినా హరిజెనులు బీదోల్లడుక్కునెటోల్లు. ప్రసాదం గిట్టవెడితె తీసుకునెటోల్లు. పీరీల పండుగనాడు తెలుగోల్లంత బలె సంబురంగ తిరిగెటోల్లు. పీరీల దేవునికి కుడుకలు కొనేసెటోల్లు. పీరికింది కెల్లిగెటోల్లు. క్రిచ్చన్ల పండుగప్పుడు గూడ అందరు పాల్గొనెటోల్లు. లగ్గాలు గిగ్గాలయినా ఒగల దాంట్లొగలు పాలు పంచుకునెటోల్లు. అంటరానితనమసొంటిది కొంతున్నా మతం గురించి మాత్రమేం భేదంజూపకపోదురు. గివ్వన్ని నేను సిన్నప్పుడు సూసిన సంగతులు.

అటెనుక ఊల్లల్ల మార్కుండేయ యువజెన సంగం, కాపు సంఘం, యాదవ సంఘం గిట్ల కులాల పేర్లమీన సంఘాలు పెట్టుకునుడు సూసిన. అయినాగని మతాలపేరుమీన పట్నాలల్ల పొడుసుకునుడసొంటియి లేక పల్లెటూల్లల్ల మంచిగ కల్సిమెల్సుండుడు నాకు మంచిగనిపిచ్చేది.

అయితె మొన్న మొన్నోసారి నేనూల్లెకు పొయ్యొవారకూల్లె పీరీల పండుగయితంది. పీరీలెంబడి మునుపటి తీరుగ బాగమంది లేరు. మునుపెటి తీరుగ వాటెంబడి తిగిగే అరొక్క కులపోల్లు కనవడుత లేరు. ఏంది? గిట్లుందేందని నాకు తమ్ముని వరుసున్న పిలగాన్నడిగిన. అడు సెప్పిందిని ఆశ్చర్యపెయిన.

"అన్నా! యాడాదికెల్లి గీ ఊళ్ళెకు మన హిందుమతాన్ని కాపాడెటోల్లట శెత్తండ్రు. అందర్ని జమేత్తండ్రు. హిందువులంతొక్కటని నచ్చజెప్పుతండ్రు. హిందువుల దేశంలకు గా తురుకోల్లు, క్రిచ్చనోల్లు తర్వాతచ్చిండ్రట. మనమొక్కటిగ లేకుంటె ఎన్నడో ఓనాడు వాళ్ళే మనలనేలుతరట. గందుకోసం మనల్ని మనం కాపాడుకోవల్నట. గాల్ల పండుగలు పబ్బాలతోని మనకు పెద్ద సంబందముండద్దట. గిట్ల ఎన్నో సెప్పిండ్రు. గప్పటికెల్లి కొందరు గాల్ల పండుగలకు పోతలేరు. కొందరేమొ మునుపటి తీరుగనే పోతుండ్రు".

గా మాటలిన్నంక కొన్ని సెకండ్లు నానోట్లె నుంచొక్క మాట గూడ రాలే.

"మరి తురుకోల్లు గిట్ట మన పండుగలకత్తలేరా?"

"ఎంతచ్చినా మునుపటి తీరుగత్తలేరు. వాళ్ళ మౌల్వీ సాబుగూడ ఊల్లె కత్తండట. ఆల్ల మతం

సాన గొప్పదని సెప్పుతండట. హిందు కాఫిర్లంటండట. అల్ల మతాన్నే బాగ ప్రచారం సెయ్యమన్నడట. వాతోని ఇపూం జెప్పిండు" అన్నడు.

నాకు ఊల్లె గడ్డాలు పెంచుకొనున్న ఒకరిద్దరు ఇదువరకే కనిపిచ్చిండ్రు. కని నేనాలోసించలే. కొంతరేమొ ఎప్పుల్లేంది నొసలుమీన బొట్టు పెట్టుకోని తిరుగుడు గూడ జూసిన. గివ్వన్నిటికి కారణమేందో నాకు తమ్ముని మాటలిన్నంక సముజయింది.

"మరి క్రిచ్చన్లో సంగతో?" అన్న.

"గాల్లేం తక్కోలేరు. అప్పుడప్పుడు ఫాదిరి పంతులచ్చిపోతండు. గా మతం తీసుకున్నోల్లు ఆడోల్లు గూడ బొట్టు పెట్టద్దని సెప్పిండట. ఇతర్ల దేవుల్ల ప్రసాదం తినవద్దన్నడట. కొందరు గా మాటలిని గట్లనే సేత్తండ్రు. ఎంతయిన మునుపటితీరుగ ఒగల పండుగలల్లొగలు సంబరంగ పాల్గొంటలేరు" అన్నడు.

అటెనుక ఊల్లెకు పెయినప్పుడు గమనించిన. ఒగల మతపోల్లంటె ఇంకొగల మతపోల్లకు మునుపటి తీరుగ ప్రేమలు, అప్యాయతలు లేకుంటయితన్నయి. మొన్న మొన్ననే మా పక్కూర్లె మతకలహమసొంటివయి కొట్లాడుకున్నరని తెలిసింది. ఇంతకుముందు పట్నాలవరకే ఉన్న మతకలహాలు పల్లెలకు గూడ పాకుడు సాన బాద కల్గిస్తున్నది. మనిషిని మనిషికి దూరం జేసేటి మతాలంటె, కులాలంటె నాకిదువరకే ఉన్న అసహ్యం ఇంకింతెక్కువయింది.

సదువేత్తె ఉన్న మతి పోతదంటరు సూడు. గట్లుంది సంగతి. సదువుకున్నోల్లు పెరుగుతంటె గీ కులాలపిచ్చి, మతాలపిచ్చి తగ్గన్నా ఎందుకు పెరుగుతందో తెలుత్తలేదు. మరి దేశం ముందుకు పోతుందంటె గిదీంట్లనేనా?"

దేవుళ్ళందరొక్కటేనాయె. అన్ని మతాల సారమొక్కటెనన్రి. మరి గివ్వెన్నెందుకు.

మతం మత్తుమందన్నడో తత్వవేత్త. మతం గులాబిపువ్వసొంటిది. దానికి మంచి వాసనుంటది. గుచ్చుకునే ముండ్లుంటయన్న దొగయిన.

ఓ దిక్కు చావుబతుకుల పోరాటాలు, మరోదిక్కు కులాలు, మతాలు. గిదంత జూత్తుంటె నాకు వడ్లు పెరుగు[79] గలిపినట్టే అనిపిత్తంది.

★ ★ ★